క్లుప్తంగా

రమాబాయి జయంతి ఉత్సవాలు జయప్రదం చేయాలి

భైంసాటౌన్: భారత రాజ్యాంగ నిర్మాత డా బీఆర్ అంబేద్కర్ సతీమణి, రమాబాయి అంబేద్కర్ జయంతి ఉత్సవాలను విజయవంతం చేయాలని నిర్వాహకులు ఓ ప్రకటనలో తెలిపారు. పట్టణంలోని నర్సింహానగర్ బుద్ధ విహార్ ఆధ్వర్యంలో వాసవి స్కూల్ సమీపంలో ఆదివారం సాయంత్రం 5 గంటలకు కార్యక్రమం ఉంటుందని పేర్కొన్నారు. ఇందులో భాగంగా రమాబాయి జీవిత చరిత్రపై మహారాష్ట్ర పూణెకు చెందిన బృందంతో ప్రదర్శనలు ఉంటాయని తెలిపారు. నియోజకవర్గంలోని ప్రతి ఇంటి నుంచి అధిక సంఖ్యలో తరలిరావాలని కోరారు.

కాంగ్రెస్ మండల అధ్యక్షురాలిగా సురేఖ


సురేఖ

కడెం: కాంగ్రెస్ మహిళా మండలాధ్యక్షురాలిగా లింగాపూర్‌కు చెందిన మాదాసు సురేఖ నియమితులయ్యారు. హైదరాబాద్ గాంధీభవన్‌లో నిర్వహించిన సమావేశంలో రాష్ట్ర అధ్యక్షురాలు సునీతారావు, జిల్లా అధ్యక్షురాలు దుర్గ భవానిలు ఆమెకు నియమాకపత్రం అందజేశారు. తన నియామకానికి సహకరించిన జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క, ఎమ్మెల్యే వెడ్మబొజ్జు పటేల్, డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు, మహిళా విభాగం రాష్ట్ర, జిల్లా అధ్యక్షురాలికి సురేఖ కృతజ్ఞతలు తెలిపారు.

ప్రహరీ నిర్మించొద్దని వినతి


డీఎం హరిప్రసాద్‌కు వినతిపత్రం అందిస్తున్న కాలనీవాసులు

కుభీర్: కుభీర్ బస్టాండ్ చుట్టూ ప్రహరీ నిర్మించొద్దని గణేశ్‌నగర్ కాలనీవాసులు పేర్కొన్నారు. మండలకేంద్రంలో శనివారం ఆర్టీసీ డీఎం హరిప్రసాద్‌ను కలిసి వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ బస్టాండ్ వెనుక గల గణేశ్‌నగర్ కాలనీవాసులకు బస్టాండ్‌లో నుంచి ఒక పక్కన రోడ్డు ఉందన్నారు. ప్రహరీ నిర్మిస్తే కాలనీవాసులకు రాకపోకలు నిలిచిపోతాయన్నారు. దీంతో రాకపోకల కోసం దూరం తిరిగి రావల్సి ఉంటుందన్నారు. బీజేపీ నాయకులు ఎ.దత్తాత్రి, కాలనీవాసులు సాయినాథ్, గణేశ్, శంకర్, లింగన్న తదితరులు ఉన్నారు.

కారు, బైక్ ఢీ

ముధోల్: మండలంలోని తరోడా గ్రామం వద్ద శనివారం కారు బైక్ ఢీకొన్న ఘటనలో ఇద్దరికి తీవ్రగాయాలయ్యాయి. స్థానికులు తెలిపిన వివరాల ప్రకారం.. ముధోల్ వైపు నుంచి భైంసా వైపు కారు వెళ్తోంది. భైంసా మండలం బాకోట్ పాంగ్రా గ్రామానికి చెందిన ఆనంద్, సావిత్రబాయి బైక్‌పై ముధోల్ నుంచి భైంసా వైపు వస్తుండగా కారు వెనుక నుంచి ఢీకొంది. ఈ ఘటనలో తీవ్రగాయాలైన ఇద్దరిని స్థానికులు 108లో భైంసా ఏరియాస్పత్రికి తరలించారు. కారు నడుపుతున్న మండలంలోని రాంటెక్ గ్రామానికి చెందిన రాజన్నకు స్వల్ప గాయాలయ్యాయి. రాజన్నను పోలీసులు అదుపులోకి తీసుకున్నట్లు సమాచారం.

రేపు ఇసుక బహిరంగ వేలం

భైంసాటౌన్: పట్టణంలోని పలు ప్రాంతాల్లో అక్రమంగా నిల్వ చేసిన ఇసుకను బహిరంగ వేలం వేయనున్నట్లు తహసీల్దార్ ప్రవీణ్‌కుమార్ ఓ ప్రకటనలో తెలిపారు. ఆటోనగర్‌లో అక్రమంగా నిల్వ ఉంచిన దాదాపు 300 క్యూబిక్ మీటర్ల ఇసుకను ఇటీవల స్వాధీనం చేసుకున్నామని, ఈ మేరకు దానికి సోమవారం మధ్యాహ్నం 12 గంటలకు వేలం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. ఆసక్తి ఉన్నవారు రూ.వెయ్యి చెల్లించి వేలంలో పాల్గొనాలని కోరారు.

నేడు విద్యుత్ అంతరాయం

లక్ష్మణచాంద: మండల కేంద్రంలో శిథిలావస్థకు చేరిన స్తంభాల స్థానంలో కొత్తవి ఏర్పాటు చేస్తున్నందున ఆదివారం విద్యుత్ సరఫరాలో అంతరాయం కలుగుతుందని ఏఈ మహేశ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. మండల కేంద్రంతోపాటు తిర్పెల్లి గ్రామంలో ఉదయం 10 నుంచి సాయంత్రం 5 గంటల వరకు సరఫరా నిలిపివేయనున్నట్లు పేర్కొన్నారు. ఈ విషయాన్ని వినియోగదారులు గమనించాలని కోరారు.

నేడు కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి ప్రచారం

భైంసాటౌన్: కాంగ్రెస్ ఎమ్మెల్సీ అభ్యర్థి వి.నరేందర్‌రెడ్డి ఆదివారం భైంసాలో ప్రచారం నిర్వహించనున్నట్లు ఆ పార్టీ నియోజకవర్గ ఇన్‌చార్జి, మాజీ ఎమ్మెల్యే బి.నారాయణ్‌రావు పటేల్ తెలిపారు. స్థానిక హరియాలి ఫంక్షన్ హాల్‌లో ఉదయం 10.30 గంటలకు కార్యక్రమం ఉంటుందని, నియోజకవర్గంలోని పట్టభద్రులు, కాంగ్రెస్ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలిరావాలని కోరారు.

ప్రయాణికుల నిరీక్షణ

- బస్‌షెల్టర్లు లేక ఇబ్బంది
- ఎండలోనే ఎదురుచూపులు


నిరుపయోగంగా వానల్‌పాడ్ బస్‌షెల్టర్


మాటేగాంలో బస్సుల కోసం వేచిచూస్తున్న ప్రయాణికులు

భైంసారూరల్: భైంసా–నిర్మల్, భైంసా–బాసర, భైంసా–భోకర్, భైంసా–కుభీర్ ప్రధాన రహదారుల్లోనూ ఎక్కడ బస్‌షెల్టర్లు నిర్మించలేదు. ప్రతీరోజు వందల సంఖ్యలో బస్సుల రాకపోకలు కొనసాగే ఈ ప్రధాన మార్గాల్లో బస్‌షెల్టర్లు లేక ప్రయాణికులు ఇబ్బందులు పడుతున్నారు. బస్సుల కోసం ఎండలోనే నిరీక్షిస్తున్నారు. నిర్మల్ నుంచి బెల్‌తరోడ వరకు ఉన్న జాతీయ రహదారిపై వేలసంఖ్యలో ప్రయాణికులు రాకపోకలు చేస్తుంటారు. వర్షాకాలంలో తడుస్తూ, చలికాలంలో వణుకుతూ, వేసవికాలంలో ఇబ్బందులు పడుతూ అవస్థలు పడుతున్నారు. బస్‌షెల్టర్లు నిర్మించాలని గ్రామస్తులు గతంలో అధికారులకు వినతిపత్రాలు అందించినా ఫలితం లేకపోయింది. స్థానికంగా అవసరాల దృష్ట్యా బస్‌షెల్టర్లు నిర్మించాలని వారు కోరుతున్నారు.

నిరుపయోగంగా..

మండలంలోని మాటేగాం, వానల్‌పాడ్, తిమ్మాపూర్, మహాగాం, వాలేగాం, బిజ్జూర్ గ్రామాల్లో గతంలో నిర్మించిన బస్‌షెల్టర్లు నిరుపయోగంగా మారాయి. బస్‌షెల్టర్లు నిర్మించిన చోట బస్సులను నిలపడం లేదు. ఇప్పటికైనా ఈ ప్రధాన రహదారుల్లో జనం ఎక్కువగా ఆగే చోట్ల స్థలాలను ఎంపిక చేసి బస్‌షెల్టర్లు నిర్మించాలని ప్రయాణికులు కోరుతున్నారు.

ఎండలోనే వేచి ఉంటున్నాం



బస్‌షెల్టర్లు లేక ఎండలోనే వేచి ఉంటున్నాం. బస్సుల కోసం ఎదురుచూస్తున్నాం. బస్‌షెల్టర్లు లేక అవస్థలు పడుతున్నాం. అధికారులు స్పందించి బస్‌షెల్టర్లు నిర్మించాలి.

– రవి, ప్రయాణికుడు

అటెన్షన్ ప్లీజ్..

పొంచి ఉన్న ప్రమాదం





భైంసాటౌన్: పట్టణంలోని భైంసా–నిర్మల్ రహదారి పక్కనే విద్యుత్ స్తంభం, ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా ఉన్నాయి. స్థానిక బజాజ్ ఫ్యాక్టరీ సమీపంలో రహదారిని ఆనుకుని స్తంభం ఉండడంతో రాత్రివేళల్లో వాహనదారులు ఢీకొని ప్రమాదాల బారిన పడుతున్నారు. పలుచోట్ల రహదారికి సమీపంలో ట్రాన్స్‌ఫార్మర్లు ఉండడంతో ప్రమాదం పొంచి ఉంది. ఈనేపథ్యంలో హైవే, విద్యుత్ అధికారులు స్పందించి చర్యలు తీసుకోవాలని వాహనదారులు కోరుతున్నారు.

విద్యుత్ అధికారి: ఆదిత్య, ఏడీఈ, భైంసా సెల్: 94408 11688
హైవే అధికారి: శ్రీనివాస్‌రావు, పీడీ సెల్: 82839 01205

ముగ్గురు విద్యార్థులకు ఉపకార వేతనాలు

లోకేశ్వరం: మండలంలోని రాజూర ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన ముగ్గురు విద్యార్థులకు ఉపకార వేతనాలు మంజూరైనట్లు హెచ్ఎం రాజేశ్వర్ తెలిపారు. నముల్ల మనోజ్, కుంట యశస్విని, ఆర్ష దేవికలకు ఉపకార వేతనం కింద ఒకరికి ఏడాదిగాను రూ.12 వేలు మంజూరైనట్లు పేర్కొన్నారు. 8 నుంచి 12వ తరగతి చదివే వరకు ప్రతీ ఏడాదికి రూ.12లు అందుతాయన్నారు.

‘చలో హైదరాబాద్’ జయప్రదం చేయాలి


పోస్టర్లు ఆవిష్కరిస్తున్న నాయకులు

ఖానాపూర్: ఈనెల 20న సీపీఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ ఆధ్వర్యంలో నిర్వహించ తలపెట్టిన చలో హైదరాబాద్ కార్యక్రమాన్ని జయప్రదం చేయాలని ఖానాపూర్ డివిజన్ కార్యదర్శి సునారికారి రాజేష్ కోరారు. మండలంలోని రంగపేట పంచాయతీ పరిధిలో కొత్తగూడెం గ్రామంలో శనివారం చలో హైదరాబాద్ పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఆరు గ్యారంటీలు అమలు చేయడంలో ప్రభుత్వం విఫలమైందన్నారు. ఇందిరమ్మ ఇళ్లు, మహాలక్ష్మి పథకం కింద రూ.2500, వంటగ్యాస్‌కు సిలిండర్‌కు రూ.500 తదితర హామీలు ఏమయ్యాయని ప్రశ్నించారు. పోడు భూములకు పట్టాలు ఇవ్వడంతోపాటు అర్హులైన పేదలకు తెల్లరేషన్ కార్డులు ఇవ్వాలన్నారు. ఐఎఫ్‌టీయూ జిల్లా కోశాధికారి లింగన్న, నాయకులు స్వామి, ప్రసాద్, రాజేష్, శ్రీనివాస్, గంగన్న, రాజన్న, రాజేష్, భీంరావు, శంకర్, సావిత్రి, చంద్రకళ ఉన్నారు.

ఘనంగా విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలు


సారంగపూర్: విగ్రహాలను ఊరేగింపుగా తీసుకువెళ్తున్న గ్రామస్తులు

సారంగపూర్: మండలంలోని వైకుంఠాపూర్ సమీపంలోని దేవరలొద్దిలో నూతనంగా నిర్మించిన ప్రభులింగేశ్వరస్వామి విగ్రహ ప్రతిష్ఠాపన వేడుకలు శనివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. వేద పండితులు శ్రావణ్‌కుమార్ జోషి, ప్రవీణ్ శర్మ ఆధ్వర్యంలో శాంతి పఠనం, గోపూజ, గణపతిపూజ, తదితర పూజా కార్యక్రమాలను నిర్వహించారు. అనంతరం ప్రతిష్ఠాపనకు తీసుకువచ్చిన దేవతామూర్తుల విగ్రహాలను గ్రామ పురవీధుల గుండా ఊరేగింపు నిర్వహించారు. అనంతరం ఆలయానికి చేరుకుని ప్రత్యేక పూజలు చేశారు. ఆది, సోమవారాల్లో జరగనున్న విగ్రహ ప్రతిష్ఠాపన కార్యక్రమం అనంతరం అన్నదానం ఉంటుందని ఆలయ ధర్మకర్త లక్కడి అనిత–రాజశేఖర్ పేర్కొన్నారు.

దిలావర్‌పూర్: మండల కేంద్రంలోని ఏకనాథుని ఆలయ ప్రాంగణంలో శనివారం విగ్రహప్రతిష్ఠాపన మహోత్సవం నిర్వహించారు. వేద పండితుడు సంజయ్ శర్మ ఆధ్వర్యంలో పూజాకార్యక్రమాలు చేపట్టారు. ఆలయ ప్రాంగణంలో మహాహోమం నిర్వహించారు. ఈ కార్యక్రమాలు రెండు రోజులు కొనసాగనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. ఆదివారం ఆలయంలో మహా నందీశ్వరునితోపాటు గరుత్మంతుడు, ధ్వజ స్తంభనం, శిఖర ప్రతిష్ఠాపన, శైనశ్చరిని విగ్రహ ప్రతిష్ఠాపన చేయనున్నారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా దిలావర్‌పూర్ గ్రామాభివృద్ధి కమిటీ ఆధ్వర్యంలో ఏర్పాట్లు చేశారు.

నేడు, రేపు ప్రతిష్ఠాపన ఉత్సవాలు

ఖానాపూర్: మండలంలోని కొలాంగూడ పంచాయతీ పరిధిలో గల దేవుని గూడెం గ్రామంలో ఆది, సోమవారాల్లో శ్రీ పార్వతిఫణీంద్రాల స్వామి విగ్రహ ప్రతిష్ఠాపన ఉత్సవాలు నిర్వహించనున్నట్లు ఆలయకమిటీ సభ్యులు తెలిపారు. ఆదివారం గణపతి పూజ, పుణ్యాహవచనం, పంచగవ్యప్రాశనం, అంకురారోపణ, జలాధివాసం, ధాన్య, ఫల, పుష్ప శయ్యాదివాసం, హోమాలు, 17న పుణ్యాహవచనం, ప్రతిష్ఠ మహోత్సవం, యంత్రస్థాపన, హోమాలు, శివపార్వతుల కల్యాణోత్సవం తదితర పూజలతోపాటు అన్నదానం ఉంటుందని పేర్కొన్నారు.

సంత్ సేవాలాల్ అందరికీ ఆరాధ్యుడు


తానూరు: సేవాలాల్ విగ్రహానికి పూజలు చేస్తున్న గిరిజనులు


ఖానాపూర్: ఆలయంలో పూజలు చేస్తున్న ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుపటేల్

- ఎమ్మెల్యే పి. రామారావుపటేల్

భైంసాటౌన్: సంత్ సేవాలాల్ మార్గం ఆదర్శనీయమని, ఆయన అందరికీ ఆరాధ్యనీయుడని ముధోల్ ఎమ్మెల్యే పి.రామారావు పటేల్ అన్నారు. పట్టణంలోని సంత్ సేవాలాల్ చౌక్‌లో సేవాలాల్ మహారాజ్ 286వ జయంతి శనివారం నిర్వహించారు. ముఖ్య అతిథిగా హాజరైన ఆయన ఈ సందర్భంగా సేవాలాల్ చిత్రపటానికి పూజలు చేశారు. అనంతరం మాట్లాడుతూ సంత్ సేవాలాల్ మహారాజ్ గిరిజనులకు మాత్రమే ఆరాధ్య దైవం కాదని, అందరికీ ఆరాధ్యుడేనన్నారు. కార్యక్రమంలో సేవాలాల్ ఉత్సవ కమిటీ సభ్యులు నాజమ్‌సింగ్, భైంసా ఏఎంసీ మాజీ చైర్మన్ రాజేశ్‌బాబు, బీజేపీ నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

ఖానాపూర్: పట్టణంలోని రాజీవ్‌నగర్ కాలనీలో సంత్ సేవాలాల్ మహారాజ్ ఆలయంలో జరిగిన జయంతి వేడుకల్లో ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ప్రత్యేక పూజలు చేశారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో ఆయన్ను సన్మానించారు. నాయకులు పాల్గొన్నారు.

నిర్మల్‌చైన్‌గేట్: పట్టణంలోని దివ్యనగర్ నిర్మాణంలో ఉన్న జగదాంబదేవి, సేవాలాల్ మహరాజ్ ఆలయ ప్రాంగణంలో సేవాలాల్ జయంతిని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా భోగ్ బండార్ పూజ నిర్వహించారు. అనంతరం సేవాలాల్ మహరాజ్ చిత్రపటానికి పూలమాలవేశారు. సేవాలాల్ జయంతి ఉత్సవ కమిటీ జిల్లా అధ్యక్షుడు రాథోడ్ తుకారం, సంఘ సభ్యులు పాల్గొన్నారు.

రూ.1,00,001 లక్షల విరాళం..

జగజ్జనని జగన్మాత జగదాంబదేవి, సేవాలాల్ మహారాజ్ మందిర నిర్మాణానికి మాజీ జెడ్పీటీసీ జానకి రమేశ్ రూ.1,00,001 విరాళం ప్రకటించారు. ఈ నగదును జిల్లా సేవాలాల్ ఆలయ కమిటీ సభ్యులకు అందజేశారు. నాయకులు రాథోడ్ తుకారాం, బలిరాం నాయక్, భుక్య భీమ్‌రావు, లచ్చిరాం నాయక్, అశోక్ నాయక్, విట్టల్, గణేశ్, జాదవ్ వసంతరావు, గుగ్లావత్ రవీందర్, కున్సోత్ శుద్దర్ సింగ్‌నాయక్ పాల్గొన్నారు.

తానూరు: మండలంలోని కోలూరుతండా, మసల్గాతండా, హిప్పెల్లితండా, ఝరి(బి)తండా గ్రామాల్లో సేవాలాల్ మహరాజ్ జయంతిని నిర్వహించారు. గ్రామాల్లో మందుగా సేవాలాల్ విగ్రహానికి పూజలు చేశారు. మసల్గాతండాలో నిర్వహించిన ఊరేగింపులో యువకులు నృత్యాలు చేశారు. మాజీ సర్పంచ్ పుండలిక్, నాయకులు పాల్గొన్నారు.

లక్ష్మణచాంద: బోరిగాం తండా, వద్యాల్ తండా, పార్‌పెల్లి తండా గ్రామాల్లో బంజారాల ఆధ్వర్యంలో సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతిని నిర్వహించారు. గ్రామాల్లోని ఆలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు.

కుంటాల: దౌనెల్లితండాలో తండావాసులు శనివారం సంత్ సేవాలాల్ మహారాజ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. తండావాసులు పాల్గొన్నారు.

ముధోల్: చింతకుంట, ఎడ్‌బిడ్, విఠోలి, తండాల్లో సేవాలాల్ మహరాజ్ జయంతిని నిర్వహించారు. విఠోలితండాలో బంజారా నాయకులు సేవాలాల్ చిత్రపటానికి పూలమాలలు వేసి పూజలు నిర్వహించారు. అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. భైంసా మార్కెట్ కమిటీ డైరెక్టర్ రామ్‌నాథ్ నాయక్, మాజీ సర్పంచ్ ధూమ్‌నాయక్, గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

సారంగపూర్: మండలంలోని ఆయా గిరిజన గ్రామాల్లో సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతిని నిర్వహించారు. దుర్గానగర్, సేవానగర్, హనుమాన్‌తండా, రవీంద్రనగర్, అడెల్లి తండా, పొట్య, అర్కాయితండా, గోపాల్‌పేట్ తండా, రాంసింగ్ తండా, తదితర గ్రామాల్లో ఆయన చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. మహవీర్ తండాలో అన్నదానం నిర్వహించారు. బంజారా సమాజ్ నాయకులు పవార్ రాజేష్, ధన్‌సింగ్, పవార్ రవీందర్, లఖ్యానాయక్, దావూజీ, ప్రకాశ్ ఉన్నారు.


భైంసాటౌన్: బంజార వేషధారణలో చిన్నారులతో ఎమ్మెల్యే పి.రామారావు పటేల్


కుంటాల: దౌనెల్లి తండాలో..

కుభీర్: రాంనాయక్ తండాలో గోర్‌సేన తండా తరపున సంత్ సేవాలాల్ మహరాజ్ జయంతిని నిర్వహించారు. మహిళలు ఆయన చిత్రపటం వద్ద కొబ్బరికాయలు కొట్టి బోనాలు సమర్పించారు. మహిళలు పాటలు పాడుతూ నృత్యాలు చేశారు. అనంతరం తండాలో ర్యాలీ నిర్వహించారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. మాజీ జెడ్పీటీసీ శంకర్, బీజేపీ నాయకులు రాథోడ్ కంలేష్, గోర్ సేన అధ్యక్షుడు శత్రుఘన్, కార్యదర్శి అర్జున్, పూజారి రాహుల్, నాయకులు సంజు, రఘు ఉన్నారు.

పట్టపగలే చోరీ

నిర్మల్‌చైన్‌గేట్: పట్టపగలే దొంగతనం జరిగిన ఘటన జిల్లా కేంద్రంలో శనివారం చోటుచేసుకుంది. మంచిర్యాల చౌరస్తా ఏరియాలోని ఓ బేకరి వద్ద జంగయ్య వెళ్తుండగా అతని వద్ద నుంచి గుర్తుతెలియని వ్యక్తి కవర్ లాక్కొని వెళ్లిపోయాడు. అందులో రూ.50 వేల నగదు ఉందని బాధితుడు పోలీసులకు ఫిర్యాదు చేశాడు. వారు అక్కడికి చేరుకుని సీసీ కెమెరాలను పరిశీలించారు. ఈ మేరకు విచారణ చేపట్టారు.

పరామర్శ

కుంటాల: మండల కేంద్రంలోని నాగులపెల్లి నాగారావు, ఎనుగందుల గంగాధర్, శికారి గజ్జవ్వ ఇటీవల అనారోగ్యంతో మృతి చెందారు. ఎమ్మెల్యే రామారావు పటేల్ శనివారం బాధిత కుటుంబసభ్యులను పరామర్శించారు. ఆయన వెంట మాజీ ఎంపీపీలు అప్క గజ్జారాం, జీవీ అరుణ రమణారావు, వెంకట్‌రావు, కొండన్నగారి రమణారావు, జక్కుల గజేందర్, కె.గజేందర్, తాటి శివ, సోమ సత్తెయ్య, మోహన్, పవన్ ఉన్నారు.

కొత్త చేపల మార్కెట్ అందుబాటులోకి తేవాలి

నిర్మల్‌చైన్‌గేట్: కొత్త చేపల మార్కెట్‌ను ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని కోరుతూ శనివారం కలెక్టర్ అభిలాష అభినవ్‌కు జిల్లా కేంద్రానికి చెందిన ఏడవ తరగతి విద్యార్థిని సాయిసహస్ర వినతిపత్రం అందజేశారు. గతేడాది రూ.50 లక్షలతో నిర్మించిన చేపల మార్కెట్ నేటికి ప్రజలకు అందుబాటులోకి రాలేదన్నారు. ప్రస్తుతం ఉన్న పాత చేపల మార్కెట్ వల్ల ట్రాఫిక్ సమస్య ఏర్పడుతుందన్నారు. చేపల వ్యర్థాలు రోడ్డు పైకి రావడం వల్ల చుట్టూ ఉన్న కాలనీవాసులు ఇబ్బందులు పడుతున్నారని కలెక్టర్‌కు వివరించారు. ఆమె సానుకూలంగా స్పందించి వెంటనే సమస్య పరిష్కరిస్తానని హామీ ఇచ్చారు.

సేవలతోనే గుర్తింపు


గృహాన్ని ప్రారంభిస్తున్న ఫైజాన్‌అహ్మద్

భైంసారూరల్: సేవలతోనే సమాజంలో గుర్తింపు లభిస్తుందని అదనపు కలెక్టర్ ఫైజాన్ అహ్మద్ తెలిపారు. మండలంలోని చుచుంద్ గ్రామానికి చెందిన ఇద్దరు దివ్యాంగ పిల్లలు కలిగిన వితంతువు తాడొల్ల యోగిత కుటుంబానికి దివ్యాంగ్ శక్తి ఫౌండేషన్ ఆధ్వర్యంలో నిర్మించిన గృహాన్ని ఆయన శనివారం ప్రారంభించారు. గృహ నిర్మాణానికి సహకరించిన దాతలను అభినందించారు. యోగిత కుటుంబానికి అవసరమైన సహకారం అందిస్తామని చెప్పారు. అనంతరం గ్రామంలోని నర్సరీ, పల్లె ప్రకృతివనం, పంచాయతీ రికార్డులు పరిశీలించారు. ఎంపీడీవో సుధాకర్‌రెడ్డి, ఎంపీవో మోజం హుస్సేన్, ఫౌండేషన్ చైర్మన్ మహేశ్ తదితరులు పాల్గొన్నారు.

ఆరోగ్య పట్టభద్రుల సమస్యలు పరిష్కరించే వారికి మద్దతు

నిర్మల్‌చైన్‌గేట్: వైద్య, ఆరోగ్య పట్టభద్రుల సమస్యలు పరిష్కరించే వారికి వచ్చే గ్రాడ్యుయేట్ నియోజకవర్గ ఎన్నికల్లో మద్దతు ఇస్తామని వైద్య ఆరోగ్య శాఖ జేఏసీ కన్వీనర్, ప్రజారోగ్య వైద్య ఉద్యోగుల సంఘం జిల్లా అధ్యక్షుడు కృష్ణ మోహన్‌గౌడ్ ఓ ప్రకటనలో పేర్కొన్నారు. ఆరోగ్య శాఖలో పనిచేస్తున్న ఉద్యోగులు, వైద్యులు సహా పారామెడికల్ కోర్సుల్లో డిప్లొమా హోల్డర్లు వేలాదిమంది ఉన్నారని వారి సంక్షేమంతోపాటు భవిష్యత్తులో వారికి అండగా ఉండే అభ్యర్థికి మద్దతిస్తామని తెలిపారు.

కాంగ్రెస్ నాయకుల పూజలు

నిర్మల్‌చైన్‌గేట్: డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు ఆదివారం జన్మదినం పురస్కరించుకొని దేవరకోట దేవస్థానంలో ఆలయ ధర్మకర్త ఒడ్నం నరేందర్ ఆధ్వర్యంలో శనివారం పూజలు చేశారు. అనంతరం అన్నదానం నిర్వహించారు. నిర్మల్ మార్కెట్ కమిటీ చైర్మన్ సోమ భీంరెడ్డి, దేవరకోట దేవస్థానం చైర్మన్ కొండ శ్రీనివాస్, నిర్మల్ పట్టణ అధ్యక్షుడు చిన్ను, గండి రామన్న ఆలయ చైర్మన్ గంగోని బురాజ్, నాయకులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

అభ్యంతరాలు ఉంటే తెలియజేయాలి


జాబితాను ప్రదర్శిస్తున్న ఎంపీడీవో

ఖానాపూర్: మండలంలోని ఎంపీటీసీల పరిధిలో గల ఓటరు జాబితా పోలింగ్ కేంద్రాలపై ఏమైనా అభ్యంతరాలు ఉంటే రెండు రోజుల్లోగా తెలియజేయాలని ఎంపీడీవో సునీత అన్నారు. ఎంపీడీవో కార్యాలయంలో పోలింగ్ కేంద్రాలు, ఓటరు జాబితాను శనివారం ప్రదర్శించారు. ఎంపీవో రత్నాకర్‌రావు, సిబ్బంది తదితరులు ఉన్నారు.

ముస్తాబైన ఆలయం

ఖానాపూర్: పట్టణంలోని శాంతినగర్‌కాలనీలో ముత్యాల పోచమ్మ ఆలయం 19వ వార్షికోత్సవానికి ముస్తాబవుతోంది. ఈనెల 20న మహా గణపతి సహిత గౌరీపూజ, పుణ్యాహవచనం, యాగశాల ప్రవేశం, రుద్ర సహిత చండీయాగం, మహా పూర్ణాహుతి, అమ్మవారి విశ్వరూప దర్శనం, మహా నైవేద్యంతోపాటు బోనాల ఊరేగింపు కార్యక్రమాలు నిర్వహించనున్నారు. హైదరాబాద్ చండీ ఉపాసకుడు మనోహర్ శర్మ, అర్చకుడు శరత్‌చంద్ర ఆధ్వర్యంలో పూజలు ఉంటాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు.

నేడు శివాలయం వార్షికోత్సవం

కుంటాల: మండలంలోని పెంచికల్‌పాడ్ శివాలయం ప్రథమ వార్షికోత్సవాన్ని ఆదివారం నిర్వహిస్తున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఉదయం శివలింగానికి అభిషేకం, అర్చన తదితర పూజా కార్యక్రమాలు, అనంతరం భక్తులకు అన్నదానం నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు.

సెంట్రల్ లైటింగ్ కు మరమ్మతులు

కుంటాల: మండల కేంద్రంలో రూర్బన్ పథకంలో భాగంగా సెంట్రల్ లైటింగ్ ఏర్పాటు చేశారు. ఇటీవల చెడిపోవడంతో పంచాయతీ కార్యదర్శి రాజబాపు ఆధ్వర్యంలో శనివారం మరమ్మతులు చేయించారు. ఎంపీడీవో లింబాద్రి పరిశీలించారు.